

రేపటి నుంచి విద్యుత్‌కు అంతరాయం

పలమనేరు డీఈఈ

ప్రజాశక్తి -పలమనేరు: మహాదేవ మంగళం..పలమనేరు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 21వ తేదీ నుండి ఉదయం 6 గంటల నుండి 23వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల వరకు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వి కోట, శాంతిపురం, కుప్పం మండల పరిసరాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడ తుందని పలమనేరు డీఈఈ చిన్నప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సమయంలో తప్ప విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఈ విద్యుత్ అంత రాయాన్ని గమనించి ప్రజలు తమకు సహకరించి చాలని పలమనేరు డీఈఈ కోరారు.

అభివృద్ధికి ఆమడ దూరం

- దాసరపల్లి ఎస్‌టి కాలనీలో సమస్యల తిష్ట
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- మౌలిక సదుపాయాలు కరువు
- కాలనీ నుండి వెళ్లిపోతున్న ప్రజలు



తాటాకుల గుడిసెల్లో నివాసముంటున్న ఎస్‌టిలు

ప్రజాశక్తి -యాదమరి: మండలంలోని దసరా పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌టి కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది. ఎస్‌టిలు గ్రామానికి దూరంగా అటవీ ప్రాంతం గుట్టపై వుండడంతో అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రద్యుమ్న వారి సమస్యలు గుర్తించి ఆరిమాకులపల్లి గ్రామ సమీపంలో భూమిని కొనుగోలు చేసి నూతనంగా ఎస్టీ కాలనీ ఏర్పాటు చేశారు. అప్పట్లో 20 కుటుంబాల వారికి ఇంటి స్థలాలు మంజూరు చేశారు. వారికి ఇల్లు కట్టుకునే స్థోమత లేకపోవడంతో నేటికీ తాటాకు గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. ఎస్టి కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఒక్కొక్కరుగా అక్కడ నుండి బతుకుతెరువు కోసం చుట్టుపక్కల ఉన్న భూస్వాముల వ్యవసాయ పొలాల వద్ద కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం కాలనీలో పది కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. ఈ పది కుటుంబాల వారు కాలనీలో కనీస సౌకర్యాలు నోచుకోకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండల పరిధిలో ఎస్టీ కాలనీ మారుమూల ప్రాంతం వైపు ఉండడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఎవరూ పట్టించుకోవడం లేదు. పాలకులు అభివృద్ధిపై దృష్టి పెట్టక పోగా మౌలిక సదుపాలైన తాగునీరు , డ్రైనేజీ, వీధిలైట్లు ఎస్టి కాలనీలో ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. కాలనీ ఏర్పాటు చేసి 12 సంవత్సరాలు అవుతున్నా ఎస్టీ కాలనీ మధ్యలో సిమెంట్ రోడ్డుకు నోచుకోలేదు. ఎస్టీ కాలనీకి చెందిన బోరు మోటారు మరమ్మతు గురై సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. గ్రామపంచాయతీ అధికారులకు తాగునీరు మోటారుకు మరమ్మతు చేయాలని పలుసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. అధికారులు గ్రామ సర్పంచ్ సైతం గ్రామం వైపు రావడం లేదంటూ ఎస్టీ కాలనీలో ఉన్న ఐదు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎస్టీ కాలనీ చుట్టూ మాగాణి భూములు ఉన్నాయని, వీధుల్లో లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదని చుట్టుపక్కల అటవీ ప్రాంతం, మామిడి తోపులు ఉండడంతో తరచూ విష సర్పాలు వంటివి సంచరిస్తూ ఉంటాయని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ఎస్టీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బోరు మోటారు మరమ్మతు చేపట్టండి



మా గ్రామం కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారుకు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. దీనివల్ల మేము చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా బోరు మోటారుకు మరమ్మతులు చేపట్టాలి..

- కృష్ణన్, ఎస్‌టి కాలనీ.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి..



మా కాలనీ ఏర్పాటు చేసినప్పటి నుంచి మా కాలనీలో మధ్యలో విద్యుత్ పోల్స్ నాటి వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. వీధి మధ్యలో సిమెంట్ రోడ్డు కూడా ఇప్పటివరకు వేయలేదు. ఎన్నిసార్లు సర్పంచ్ కి, అధికారులకి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలి..

- అలివేలమ్మ.

అధికారం మాది.. ఆపేదెవరు..!

- ట్రాక్టరు ఇసుక రూ.5 వేలు
- పేరుకే ఉచితం
- రీచ్ లేకపోవడంతో బ్లాక్ లోనే కొనుగోళ్లు
- సామాన్యుడికి భారంగా ఇసుక

ప్రజాశక్తి -విజయపురం: 'ఇసుక ఉచితం....ఇసుక ఉచితం..' అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాట మరిచిపోయింది. ప్రభుత్వం మారిందే తప్ప.. ఇసుక ధర మాత్రం మారలేదు. అదే ధర, ఇంకా చెప్పాలంటే గత ప్రభుత్వంలో కన్నా కొన్ని చోట్ల ఎక్కువగానే అమ్ముకొంటున్నారు. పేరుకే ఉచిత ఇసుక రవాణా ఛార్జీలు, టీఎస్‌టీ, సీవరేజీల రూపంలో బాదుడేబాదుడు అన్నట్లుగానే మారింది. దీంతో ఉచితం ప్రచారానికే పరిమితమైంది. ఇసుకపై తర్జనభర్జనలు పడుతున్నారే తప్ప ఆ సమస్యను ఓ కొలిక్కి తెచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో సామాన్యులకు ఇసుక పెనుభారంగా మారింది. ఇసుకతో ఇక ఇల్లు కట్టుకోలేకపోతున్నారు.

బ్లాక్ మార్కెట్‌లో ఇసుక రూ. 5వేలు

నగరి నియోజకవర్గంలో ఇసుక రీచ్ ఎక్కడా లేదు. దీంతో ఇళ్ల నిర్మాణం కోసం బ్లాక్‌లో ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు రూ.5 వేల నుంచి రూ.6 వేలు ధర పలుకుతోంది. నియోజకవర్గంలో ఎక్కడైనా ఇదే ధర అమలులో వుంది. ఇలా ఇసుక అందుబాటులో లేకపోగా ధరలు భగ్గుమంటున్నాయి.



అక్రమంగా తరలిపోతున్న ఇసుక

ఇసుక అక్రమ రవాణా

నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు దారి తీస్తోంది. విజయపురం మండలం కేవీ శ్రీరామపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన సొంత పొలం దారి ఏర్పాటు చేసుకొని రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు నుంచి రూ.6 వేలు వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదని, వారం వారం అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా తాను తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్ల ఆయనను పట్టుకోకూడదని ఓ వర్గానికి చెందిన నాయకుడు అధికారులకు సూచించినట్లు సమాచారం. ఇసుక కొరత ఆ రైతుకు ఓ వరంగా మారింది. దీంతో రోజుకి రూ. 20 వేలుపైగా సంపాదిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని, లేకుంటే ఇసుక అక్రమ రవాణా అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



యథేచ్ఛగా రవాణా చేస్తుండడంతో తరిగిపోతున్న ఇసుక నిల్వలు



వర్షానికి సదుం మండలంలో నేలవాలిన వరి పైరు

వర్షంతో నష్టం.. నేలకొరిగిన వరి..

రైతుల ఆందోళన

ప్రజాశక్తి- సదుం : గత వారం కురిసిన వర్షాలకు సదుం మండలంలో పలు గ్రామాల్లో వరి పంట నేల వాలింది. దీంతో తమకు భారీ నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం తుపాను ప్రభావంతో సదుం మండలంలో కురిసిన వర్షాలకు తాటిగుంటపాలెం గ్రామ పంచాయతీ, ఎర్రగుంట్ల వారి పల్లి పరిధిలోని వరి రైతులు సుమారు 8.57 ఎకరాలలో సాగు చేసిన వరి పంట నేలకొరిగిందని రైతు వై వెంకటరమణారెడ్డి 'ప్రజాశక్తి' కి తెలిపాడు. రైతు వై వెంకటరమణారెడ్డి ఆదివారం మాట్లాడుతూ వై రంగమ్మ, భాగ్యమ్మ లకు చెందిన 1.50 ఎకరాల వరి, జానకికి చెందిన 15 గుంటల వరి పంట, ముని రెడ్డికి చెందిన 25 సెంట్లు వరి , రమణారెడ్డి పొలం 20 సెంట్లు వరి , వై శ్రీనివాసులు రెడ్డి, వై తిమ్మారెడ్డిలకు చెందిన 2.50 ఎకరాల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వై వేణుగోపాల్ రెడ్డికి చెందిన 1.50 ఎకరాల వరి పంట, వై రామచంద్రారెడ్డికి చెందిన 0.75 సెంట్లు వరి , వై ఎర్రం రెడ్డికి చెందిన ఒక ఎకరా వరి , బి ముని రెడ్డి కి చెందిన 0.25 సెంట్లు వరి పంటకు నష్టం వాటిల్లింది. వై వెంకట్ రమణారెడ్డికి చెందిన ఒక ఎకరా వరి పంటలు పూర్తిగా నేలకొరిగి, నీట మునిగాయని ఆయన తెలిపారు. గత వారం వరి కోతలు కోసిన రైతులకు వర్షాలకు ధాన్యం బస్తాలు సుమారు 250 బస్తాల వడ్ల మూటలు, రెడ్డి చెరువు బండ పైనే ఇప్పటికీ వుందని వాపోయారు. వ్యవసాయ అధికారులు ఇంతవరకు తమ పంట పొలాలను పరిశీలించలేదన్నారు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని వరి రైతును ఆదుకోవాలని వారు కోరారు.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

'పోలీస్ ప్రజా ఫిర్యాదుల వేదిక' వాయిదా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సోమవారం నిర్వహించాల్సిన 'ప్రజా సమస్యల ఫిర్యాదుల కార్యక్రమం' కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 22వ తేదీ మంగళవారానికి వాయిదా వేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ సమస్యలను తెలుపుకునేందుకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు పోలీస్ ఆఫీస్(ఓల్డ్ డిపివో) కార్యాలయానికి రావాలని చిత్తూరు ఎస్‌పి మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తప్పుడు ప్రచారంపై ఖండన

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ద్రావిడ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం విషయంలో కొందరు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ చేస్తున్న ప్రచారాన్ని కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవంతో పాటు బాషా, హరప్పా భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను ముద్రించామని, ఈ పత్రికలలో కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖుల పేర్లు ప్రోటోకాల్ అనుసరిస్తూ ముద్రించడం ఆనవాయితీ అన్నారు. శిలాఫలకం పై ముద్రించే పేర్లను మాత్రమే ప్రజా ప్రతినిధుల హోదాలను అనుసరించి ప్రోటోకాల్ పాటిస్తున్నారన్నారు. దీన్ని అనుసరుస్తూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మొట్టమొదట ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు ముద్రించామన్నారు. ఈ విషయాన్ని గుర్తించక కొంత మంది ఆహ్వాన పత్రికలలో ముఖ్యమంత్రి పేరు ముద్రించలేదని ప్రచారం చేయడం సరికాదన్నారు.



మాట్లాడుతున్న ద్రావిడ విశ్వవిద్యాలయ విసి కిరణ్‌కుమార్



ద్రావిడ విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ , అతిథులు

ఘనంగా ద్రావిడ విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కుప్పం టౌన్, గుడిపల్లి :

ద్రావిడ విశ్వవిద్యాలయ 27వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ , ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం , కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మరమ్మత్, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ , ఆచార్య ఎం దొరస్వామి , రిజిస్ట్రార్ వి కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ తర్వాత వర్సిటీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో జరిగిన సభలో ముఖ్య అతిథి కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ..యూనివర్సిటీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. యూనివర్సిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. వర్సిటీని ప్రక్షాళన చేసేందుకు టిడిపి ప్రభుత్వం నడుం బిగించిందని, దేశంలో ద్రావిడ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం వుందని.. యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఉద్యోగి కష్టపడి పని చేయాలన్నారు. వర్సిటీలో కింది స్థాయి నుంచి పై స్థాయి దాకా అందరూ కలిసికట్టుగా ఒకే తాటిపై వర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎన్టీఆర్ ఎంతో ఉన్నతాశంతో ఏర్పాటు చేసిన యూనివర్సిటీని అభివృద్ధి చేసి ఆయన ఏర్పాటు చేసిన ఉద్దేశానికి న్యాయం చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం కుప్పంలో స్థాపించడానికి చేసిన కృషి గురించి వివరించారు. కడ పీడీ వికాస్ మరమ్మత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎలా చదువుకోవాలి? సమాజం పట్ల ఎలా నిబద్ధతతో ఉండాలో విశ్వవిద్యాలయం నుంచి నేర్చుకోవాలని చెప్పారు. విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తూ విశ్వవిద్యాలయ ముందు ఐదేళ్లు ఎలా అభివృద్ధి చేయాలో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, ఉద్యోగస్తులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ఈ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన క్లాస్ రూమ్స్‌ను కంచర్ల శ్రీకాంత్ , పిఎస్ మునిరత్నం, విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి ప్రారంభించారు.

గాయత్రీదేవికి డాక్టరేట్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : గుడిపాల మండలం చిత్తపార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీష్‌గా పని చేస్తున్న కరణం గాయత్రీదేవి డాక్టరేట్ పొందారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ పి హరిపద్మరాణి పర్యవేక్షణలో " రీడింగ్ గ్రేడెడ్ మెటీరియల్స్ ఇన్ ఇంగ్లీష్ - ఏ కేస్ స్టడీ ఆఫ్ చాలెంజస్ ఫేస్డ్ బై గవర్నమెంట్ స్కూల్ చిల్డ్రన్ అట్ ది సెకండరీ లెవెల్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉపాధ్యాయిని గాయత్రీదేవికి డాక్టరేట్ లభించింది. ఫిలాసఫీ ఆఫ్ డాక్టరేట్ (పీహెచ్ డి) కోసం నిర్వహించిన రీసెట్ ప్రవేశ పరీక్షలోనూ గాయత్రీదేవి ఉత్తమ ప్రతిభ చాటి మొదటి ర్యాంకుతో అడ్మిషన్ పొందారు. ఓవైపు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే మరో వైపు తన పరిశోధనలను పూర్తి చేసి త్వరలో జరగనున్న యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకోనున్నారు. కాగా డాక్టరేట్ సాధించిన గాయత్రీదేవిని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగం ప్రొఫెసర్, రీసెర్చ్ సూపరువైజర్ డాక్టర్ హరిపద్మరాణి, ఆంగ్ల విభాగం ప్రొఫెసర్లు, చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు, చిత్తూరు డివైఈవో చంద్రశేఖర్, గుడిపాల ఎంఈఓ1 హసన్ బాష, ఎంఈఓ 2 గణపతి, చిత్తపార జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్ శరవణ, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

కళలను కాపాడుకుందాం..

తిరుపతి కళా సంస్కృతి రెడ్డెప్ప

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కళలను కాపాడుకుందామని తిరుపతి కళా సంస్కృతి బృందం సభ్యులు రెడ్డెప్ప అన్నారు. మండల కేంద్రం లోని నాలుగు రోజులు పాటు చేపట్టిన కళాజాతాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించేం దుకు కళాజాత ముందుం టుందని రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు గుర్తించి ప్రత్యేక సదుపాయాలు కల్పిం చాలన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం సభ్యులు శేషాద్రి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుపతి కళా సంస్కృతి సభ్యులు

నిర్లక్ష్యం!

- ఏళ్లు తరబడి చేతిబోర్లు నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు
- గ్రామీణ వాసులకు తప్పని నీటికష్టాలు

గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే చేతి బోర్లు నేడు ఎక్కడ చూసినా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వందల సంవత్స రాలుగా చేతి బోర్లు మీదనే ఆధారపడి జీవించే గ్రామీణులు నేడు విద్యుత్ బోర్లపై ఆధారపడి తాగునీటి కష్టాలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బోర్ల మరమ్మతును అధికారులు పట్టించుకోక పోవడంతో తుప్పు పట్టి చోరీలకు గురవుతున్నాయి. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

ప్రజాశక్తి-పూతలపట్టు: గతంలో గ్రామీణ ప్రజలు అధికంగా తాగునీటి కష్టాలను అధిగమించడానికి చేతిబోరులను నమ్ముకునేవారు. దీంతో ప్రతి ఏటా వేసవి వస్తున్న తరుణంలో మంచినీటి ఎద్దడిని అరికట్టేందుకు వార్డుల్లో గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట మంచినీటి బోర్లను తవ్విస్తూ ఉండేవారు. వేసవి ప్రత్యేక ప్రణాళిక అంటూ ప్రతి గ్రామంలో అవసరమైన చోట రెండు నుంచి మూడు వరకు చేతి బోర్లు వేసేవారు. దీంతో ప్రజలు కూడా విద్యుత్ అవసరం లేక చేతి బోర్లు వినియోగం ద్వారా తమ తాగినీటి సమస్యలను పరిష్కరించుకునేవారు. క్రమంగా ఇంటింటికీ కుళాయిలు రావడంతో గ్రామీణ ప్రజల సైతం చేతిబోర్లను పట్టించుకోవడం మానేశారు. దీంతో ఎక్కడ చూసినా చేతి బోర్లు అక్కడ మరమ్మతులకు నోచుకోక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

పూతలపట్టులో పరిస్థితి

పూతలపట్టు మండలంలో 25 పంచాయతీలు ఉండగా ఇందులో 252 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో సుమారు 962 చేతి బోర్లు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 80 శాతం చేతి బోర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని బోర్లు పూర్తిగా తుప్పు పట్టిన పరిస్థితిలో ఉండగా సంబంధిత గ్రామీణ ప్రజలు వాటిని ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు.

పట్టించుకునే వారే కరువు..

ఎలాంటి సమయాల్లోనైనా గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే చేతి బోర్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చేతి బోర్ల మరమ్మతులు చేసే వారే నేడు కనిపించడం లేదు. కనీసం ఎంపీడీవో కార్యాలయ పరిధిలో కూడా వీరు కరువయ్యారు. గతంలో చేతి బోర్ల మరమ్మతుల కోసమే ప్రత్యేక అధికారి ఉండేవారు. ప్రస్తుతం ఈ అధికారి ఊసే లేదు. దీంతో సంవత్సరాలు తరబడి చేతి బోర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



మరమ్మతుకు నోచుకుని బోరు

రూ. లక్షల్లో ప్రజాధనం వృథా

బోర్ల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న లక్షల రూపాయల నిధులు నేడు వృథాగా మారాయి. ఒక్కో బోరు వేయడానికి రూ. లక్ష రూపాయల నుంచి ఒకటిన్నర లక్ష వరకు ఖర్చవుతుంది. అధిక లోతు తవ్వడంతో మరింత ఖర్చయ్యే అవకాశం వుంది. బోరు తవ్వాం..మనపని అయిపోయిందన్నట్టుగా అధికారులు వ్యవహ రిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రతి గ్రామంలో ఎక్కడెక్కడ మంచినీటి బోర్లు పాడైపోయాయో గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడితే ప్రజాధనాన్ని కాపాడిన వారవుతారని ప్రజలు అంటున్నారు.

గ్రామ పాలనలో పారదర్శకతకు పెద్దపీట

పార్వతి, చిత్తూరు జిల్లా డిపిఓ

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి -వి కోట : చిత్తూరు జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తామని చిత్తూరు డిపివో పార్వతి అన్నారు. జిల్లా డిపివోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్వతి 'ప్రజాశక్తి' ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు చర్యలు చేపడుతున్నారు?

సమాధానం: గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టి తొలగించిన వ్యర్థాలను ఊరి బయటకు తరలించాలని కార్యదర్శులను ఆదేశించాం. గ్రామాల్లో దోమలు ప్రబలకుండా మురుగు నీటి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేసి, మురుగు నీరు కాలువల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించాం. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించాం. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు అందరు ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలను ఆదేశించాం.

ప్రశ్న: ప్రస్తుతం జిల్లాలో డయేరియా, డెంగీ ప్రబలకుండా తీసుకున్న చర్యలు ఏమిటి?

సమాధానం: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తాగునీటి బోర్లలో కొత్తనీరు చేరుతోంది. దానికి అనుగుణంగా తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించాం. గ్రామ పంచాయతీలకు నిధుల కొరత లేదని ఆరోగ్య సిబ్బంది సహకారంతో వేడి ఆహారం తినాలని, కాచి వడబోసిన నీరు తాగాలని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. పారిశుధ్యం లోపించకుండా ప్రజాప్రతినిధులు, కార్యదర్శులను సహకరించాలని కోరాం.

ప్రశ్న: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాలు గ్రామాల్లో చేపడుతున్న పనులపై ప్రజల్లో వస్తున్న స్పందన ఎలా వుంది?

సమాధానం: జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను, గ్రామ పంచాయతీ నిధులకు అనుసంధానం చేస్తూ శాశ్వతమైన సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల పనులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పనులను చేపడుతున్నాం. పండుగ వాతావరణంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోంది. రాబోవు కాలంలో మరిన్ని శాశ్వత పనులను ఈ పథకం కింద చేపట్టి పూర్తి చేస్తాం.

ప్రశ్న: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా ఎదిగేందుకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

సమాధానం: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వివిధ చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేసేందుకు డిమాండ్ నోటీసులు అందించి పన్నులు వసూలు చేయాలని, నూతనంగా ఇళ్లు నిర్మించే యజమానులు పంచాయతీ అప్రూవల్ విధిగా తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించాం. గ్రామ పంచాయతీలకు వివిధ మార్కెట్లకు నిర్వహించే వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని పూర్తిగా వసూలు చేసి గ్రామ పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని కార్యదర్శులను ఆదేశించాం. చేపల చెరువు వేళల్లో హెచ్చు పాట దారుల నుండి పాడిన మొత్తం నగదు వసూలు చేయాలని ఆదేశించాం.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరిగిన సిబ్బంది బదిలీల కారణంగా ప్రజా సమస్యలు ఎంతవరకు పరిష్కారం అవుతాయి?

సమాధానం: కలెక్టర్ పర్య వేక్షణలో బదిలీలు పార దర్శకంగా నిర్వ హించాం. కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది బదిలీ అయిన ప్రాంతంలో మొత్తం పంచాయతీ రికార్డులు అప్పగించి, నూతనంగా బాధ్యతలు స్వీకరించే గ్రామ పంచాయతీల్లో అన్ని రికార్డులను సరిచూసుకొని బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించాం. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో సర్దుబాటు కారణంగా సిబ్బంది కొరత లేదని , ప్రతి గ్రామ పంచాయతీలో తప్పని సరిగా 34 రికార్డులను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించాం. నూతన ప్రభుత్వంలో పారదర్శక గ్రామ పాలనకు కింది స్థాయి సిబ్బంది సహకారం అవసరమని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను కలెక్టర్ వారి ఆదేశాల మేరకు గ్రామాల్లో శాశ్వతమైన పనులకి వెచ్చించాలని ఆదేశాలు జారీ చేశాం.

అభివృద్ధి శూన్యం

- కొనసాగుతున్న ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో - రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలి
- అడ్డుపడుతున్న అధికార పార్టీ నాయకులు - కుంటుపడుతున్న అభివృద్ధి



రెగ్యులర్ ఎంపిడివో లేక ఖాళీగా వున్న సీటు

ప్రజాశక్తి - విజయపురం: జిల్లాలోని విజయపురం మండలం ఓ మారుమూల ప్రాంతం.. అభివృద్ధి అంతంత మాత్రంగానే వుంది. ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాటలో నడుస్తోంది.. ఇక్కడ అనుభవం కలిగిన అధికారులను నియమించి అభివృద్ధి బాటలో నడిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి శూన్యం

ఇటీవల సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో బదిలీపై వెళ్లారు. దీంతో నగరి ఈవోపీఆర్డీ అయిన విజయపురం ఈవోపీఆర్డీగా బదిలీ చేస్తూ ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. అయితే విజయపురం మండలం కోసలనగరం గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో బాధ్యతలు ఇవ్వాలని జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి, విజయపురం ఏవో రమణప్రకాష్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఇన్‌ఛార్జి తీసుకున్న మొదటి నుంచే ఆయన నుండి సిబ్బందికి వేధింపులు ప్రారంభమయ్యాయి. తాను జిల్లాలో 15 సంవత్సరాలు పని చేశానని, తనను ఎవ్వరూ ఏమి చేయలేరని, తనకు రాజకీయ అండదండలు ఉన్నాయని కార్యాలయంలోని సిబ్బందిపై చిందులు వేయడం ప్రారంభించారు. అంతే కాకుండా తన గదుల్లో రాజకీయ నాయకులతో మాట్లాడేటప్పుడు ఏ సిబ్బంది రాకూడదని, కనీసం తలుపు వద్ద కూడా నిలబడకూడదని నిబంధనలు విధించినట్లు తెలిసింది. తనకు జీతం లేకపోయినా పని చేస్తానని, ఇప్పటికీ తనకు జీతం లేదని, అయినా తనను కాపాడానికి రాజకీయ నాయకులు వున్నారని, తనకు ఎలాంటి భయం లేదంటూ అభివృద్ధి బాటను గాలి వదిలేస్తున్నాడని కార్యాలయంలో సిబ్బంది గుసగుసలాడుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

బదిలీలపై ప్రభుత్వ ఆదేశాలు అనుసరిస్తూ కలెక్టర్ ద్వారా బదిలీలు చేసినా, ఇంకా కొన్ని మండలాల్లో పంచాయతీ రాజ్ శాఖలో విధుల్లో పంచాయతీ కార్యదర్శులు చేరలేదు. సెప్టెంబర్ 23వ తేదీ నుండి బదిలీలపై నిషేధం అమలులో వుంది. 22వ తేదీ వరకు ఉత్తర్వుల జారీ చేసినా నెల రోజులు అవుతున్నా అమలు కావడంలేదు. కొంతమంది అధికారులు బదిలీ ఉత్తర్వులు ఉద్యోగులకు ఇవ్వలేదు. మరి కొందరు బదిలీపై వచ్చిన వారిని రిలీవ్ చేయడం, చేర్చుకోవడంలో జాప్యం వహిస్తున్నారు. దీన్ని వల్ల ఉద్యోగుల్లో సైతం గందరగోళం నెలకొంది.

క్రైం న్యూస్

యువకుడు అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -కార్వేటినగరం: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజకుమార్ కథనం మేరకు..అమ్మపల్లి క్రాస్ నుంచి సురేంద్రనగరం వెళ్లే మార్గంలో గోపిశెట్టిపల్లె గ్రామం వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించామన్నారు. గత ఐదు నుంచి ఆరు రోజుల క్రితం వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు వున్న ఏబీ స్విచ్ ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించి మృతి చెంది ఉండవచ్చన్నారు. మృత దేహం గుర్తు పట్టని విధంగా కుళ్లి పోవడంతో పాటు, తలకు ఉన్న జుట్టు పూడి పోవడంతో వ్యక్తిని పూర్తిగా గుర్తించలేకపోతున్నామన్నారు. మృతుడికి 38 సంవత్సరాలు వయసు ఉండవచ్చని, 5.5 అడుగులు ఎత్తు ఉండవచ్చని అతను బ్లూకలర్ గళ్ల లుంగీ, పాచికలర్ కట్ బనియన్, ఎరుపు, తెలుపు గీతల టవల్ వేసుకున్నట్లు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440900690 నంబర్ కు సమాచారం అందించాలని సూచించారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది.

బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం

ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -పుంగనూరు: ఆర్‌టిసి బస్సును ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. చిత్తూరు నుండి మదనపల్లి వైపు వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక బైపాస్ రోడ్ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భగత్ సింగ్ కాలనీకి చెందిన కుమార్ కుమారుడు ధనుష్ (18), బాబు కుమారుడు ప్రవీణ్(17), రాజ్ కుమార్ కుమారుడు మహేష్(16) ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలపై కేసు

ప్రజాశక్తి -కార్వేటినగరం: పశువును అపహరించి, వధించి మాంసాన్ని ఆటోలో తరలిస్తున్న దొంగలపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాజుకుమార్ తెలిపారు. ఆదివారం తమ కార్యాలయంలో ఆయన విలేకరుతో మాట్లాడుతూ వెదురుకుప్పం మండల దిగువ గెరిగదొన్న గ్రామానికి చెందిన బి.హరిబాబు పశువులను కార్వేటినగరం రిజర్వు ఫారెస్టులో మేత కోసం వదిలిపెట్టాడు. మేత కోసం వెళ్లిన పశువును వడమాలపేట మండలం ఎసీబిఆర్ పురం హరిజనవాడకు చెందిన సూర్య, తరుణ్, ఎగున గూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రిలు కలిసి అపహరించి వధించి మాంసం భాగాలను ఒక ఆటోలో తరలిస్తుండగా ఆవును వెతుక్కుంటూ వెళ్లిన హరిబాబును, చుట్టు పక్కల వారిని చూసి నిందితులు పరారీ "కావడంతో హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆటోను స్వాధీనం చేసుకుని వారిపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులపై దాడి కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -పుంగనూరు: రైతులను దాడి చేసి గాయ పరిచిన సంఘటనలో నలుగురిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. జులై17వ తేదీ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి పుంగనూరు పర్యటన సందర్భంగా చిత్తూరు మాజీ ఎంపీ ఎన్ రెడ్డెప్ప ఇంటికి వచ్చాడు. ఈ సంఘటనను తెలుసుకున్న నేతి గుట్లపల్లి రిజర్వాయర్ భూములు కోల్పోయిన రైతులు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని కలిసి నష్టపరిహారం అడిగేందుకు అక్కడికి చేరుకున్నారు. అక్కడికి రైతులు చేరుకోవడంతో పుంగనూరు పట్టణానికి చెందిన వైసిపి నాయకులు కొందరు రైతులపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనపై టిడిపి నాయకులు సుహేల్ బాష, ప్రసాదు స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై నానా సాబ్ పేటకు చెందిన షంషీర్ బాష కుమారుడు మహబూబ్ బాషా అలియాస్ అమ్ముకుట్టి, రాతి మసీదు వీధికి చెందిన నజీర్ బాష కుమారుడు షేక్ ఇర్ఫాన్, తాజ్ నగర్ కు చెందిన పజులు లుద్దీన్ కుమారుడు నిజాముద్దీన్, సుబేదార్ వీధికి చెందిన అన్వర్ భాష కుమారుడు సయ్యద్ అయాజ్ లను పోలీసులు అరెస్టు చేశారు. వీరు గొడవలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు పరారీలో వున్నారని, పోలీసులు వారికోసం గాలించి అరెస్టు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా మరో 10 మంది వైసిపి నాయకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ శ్రీనివాసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారని తెలిపారు.



గుంతలమయమైన రోడ్డు

దారి ఇలా..? ప్రయాణం ఎలా..?

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్తవెంకటాపురం రోడ్డు అగ్రహారం నుంచి ఫారంమిట్ట వరకు రోడ్డు గుంతల మయమైంది. నిత్యం తమిళనాడు లోని రాణిపేట, వేలూరుకు ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుం టాయి. ఈ గుంతలమయమైన రోడ్డులో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతుకు నోచుకోవడం లేదని గ్రామస్తులు, వాహన దారులు వాపోతున్నారు. ఈ చుట్టుపక్కల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు చిత్తూరు నుండి మండల కేంద్ర మైన గంగాధర నెల్లూరు చేరుకోవాలంటే కిందపడి లేచి ప్రయాణించాల్సి వస్తోంద న్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటో కార్మికుల ఆయుధపూజ



ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : నగరి పట్టణ పరిధిలో సుభాస్‌చంద్ర బోస్ ఆటో యూనియన్ సంఘం ఆధ్వర్యం లో ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. సుమారు 30కిపైగా ఆటోలకు అరటి మొక్కలు కట్టి, పుష్పాలతో అలంక రించి పూజలు చేశారు. బస్టాండు ఆవరణలో ప్రజ లకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నృత్య ప్రదర్శన చేశారు. ప్రమాదాలు జరగకుండా వుండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్ శ్రీనివాసన్ ,ఆర్క్ రవి, యేసు, లాసర్, గోపాల్, అరుముగం పాల్గొన్నారు.



తులసీనాథం నాయుడు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఘన సన్మానం

ప్రజాశక్తి- గంగవరం: జాను మర్తి హనుమత్ శాస్త్రి శత జయంతి సందర్భంగా కడపలోని సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహిం చిన ప్రత్యేక సమావేశంలో తెలుగు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథం నాయు డు దంపతులను ఘనంగా సత్కరిం చి తెలుగు భాషా పురస్కారాన్ని అందించినట్లు వారు తెలిపారు. ఈ పురస్కారాన్ని హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్, అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నట్లు వారు తెలిపారు. తెలుగు భాషకు తులసీ నాథం నాయుడు చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విఠలాచార్య గండ్లూరి దత్తాత్రేయ శర్మ, దామోదర్ నాయుడు, నిర్వాహకులు పాల్గొన్నారని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండలంలో ఈ నెల 21వ తేదీ వరకు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద మంజూరైన పనుల నిర్వహణలో భాగంగా పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీ మోహన్ సోమవారం పల్లె పండుగ వారోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ పంచాయతీల్లో సోమవారం పర్యటించనున్నారని మండల అధికారులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, సర్పంచులు, మండల ప్రాదేశిక సభ్యులు, మండల ఉపాధ్యక్షులు, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ప్రాథమిక సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, వెటర్నరీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మండల స్థాయి అధికారులు మండల , ఇంజనీరింగ్ అధికారి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, మండల పశు వైద్య అధికారి తప్పక హాజరు కావాలన్నారు.

తిరుపతిలో ఏప్రిలియా ఆర్ఎస్ 457

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : పియాజియో ఇండియా ప్రతిష్టాత్మక ద్విచక్రవాహన బ్రాండ్‌లు వెస్పా, ఏప్రిలియాలకు అధీకృత రిటైలర్ అయిన నికి మోటార్స్ తిరుపతిలోని రేణిగుంట రోడ్డులో ఉన్న తమ ప్రీమియం షోరూమ్‌లో కందాల పునీత్ కృష్ణకు 25వ ఏప్రిలియా ఆర్ఎస్ 457ను డెలివరీ చేసింది. ఈ వాహనాన్ని ఆయనకు తిరుపతి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, నికి మోటర్స్ సీఈవో నాగభూషణ్ రెడ్డితో కలిసి అందజేశారు. ఏప్రిలియా ఆర్ఎస్ 457 డెలివరీని తీసుకున్న కందాల పునీత్‌కృష్ణ మాట్లాడుతూ 'ఏప్రిలియా ఆర్ఎస్ 457ని ఇంటికి తీసుకెళ్లడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. బైక్ పనితీరు అసాధారణమైనది. నా స్పోర్ట్స్ బైక్ రైడింగ్ ప్రయాణాన్ని ఏప్రిలియాతో ప్రారంభించాలని నేను కోరుకున్నాను. నికి మోటర్స్ వారు అందించిన సహాయానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను..' అని అన్నారు. ఏప్రిలియా ఆర్ఎస్ 457 మూడు విభిన్న రంగులు - రేసింగ్ స్ట్రిప్స్, ఒపలెసెంట్ లైట్, ప్రిస్మాటిక్ డార్క్‌తో వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్స్-షోరూమ్ ధర 4.11లక్షల ఉందని వారు తెలిపారు. కొత్త వాహనాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి - గుడిపాల: గ్రామాభివృద్ధి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుం దని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గుడిపాల మండలంలోని 'పల్లె పండుగ' లో భాగంగా ఆదివారం నిర్వ హిం చిన వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని పంచాయతీలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. గుడిపాల మండలంలో మంజూరైన సుమారు 6 కోట్ల రూపాయలు విలువ చేసే పనులకు నారగల్లు, కొత్తకోటలో సిమెంటు రోడ్డు నిర్మాణం, 197 రామాపురంలో శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం, నంగమంగళం వెలురాం బట్టి గ్రామంలో బీటి రోడ్డు నిర్మాణం, పానాటూరు వద్ద బిటి రోడ్డు నిర్మాణానికి, 189 కొత్తపల్లిలోని కిలారి పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి, రామాభద్రాపురంలో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణం, బసవాపల్లిలోని గుర్రాలమిట్టలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజ్, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాంధీ, మాజీ జెడ్పిటిసి సుమతి మురళీ, బాలాజీ, మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎంపిటిసి హరిప్రసాద్ , పీటర్‌లతో పాటు పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం, నల్లవెంగనపల్లి పంచాయతీ సిసి రోడ్డుకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ వివిఎం థామస్ మాట్లాడుతూ..ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని ఎన్నో ప్రాంతాలు ఉన్నాయని అనేక గ్రామాల్లో రహదారి సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని , అభివృద్ధి చేయడానికి టిడిపి ప్రభుత్వం ఈ పల్లె పండుగను నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు నియోజకవర్గంలో నూతనంగా పరిశ్రమను తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రామకుప్పంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

రామకుప్పం: గ్రామాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని రాష్ట్ర టిడిపి నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రామకుప్పం మండలంలోని కెంచనబల్ల గ్రామంలో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. గోకులం షెడ్లు, సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ వ్యవసాయ పనిముట్లు, బ్యాంకు రుణాలతో రైతులు ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, శ్రీనివాసులు రెడ్డి, రామ్మూర్తి, చిన్ని కృష్ణ, సుబ్రీ, చంద్రశేఖర్ రెడ్డి, బాలు, విశ్వనాథ్, గుణశేఖర్, సత్తి, నాగరాజు, మురళి,రఫీ, కామరాజ్ నాయక్, రామకృష్ణప్ప, గోవిందప్ప, రమేష్ పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా జిడి నెల్లూరు..

ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : తన నియోజకవర్గంలో నూతన పరిశ్రమను తీసుకొచ్చి పారిశ్రామిక హబ్‌గా మారుస్తానని జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ పేర్కొన్నారు. ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ లో 49 కొత్తపల్లిమిట్ట, ఎస్ఆర్‌పురం పంచాయతీ లోని గుండాల మిట్ట గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న పల్లె పండుగలో భాగంగా నూతనంగా వేసిన సిసి రోడ్డును కాంట్రాక్టర్ గురునాథం గిరినాయుడు ఆధ్వర్యంలో ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో రహదారి సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం ఈ పల్లె పండుగను చేపట్టిం దన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు నియోజక వర్గంలో నూతనంగా పరిశ్రమను తీసుకొని వచ్చి నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తా నని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య, పొన్నా యుగంధర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేంద్ర, మండపేట అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, గిరి నాయుడు, గురునాథం, జీవన్ కుమార్, దాసరి సతీష్, మోహన్ నాయుడు, భాస్కర్ నాయుడు, ఎంపీడీవో మోహన మురళి, తహశీల్దారు లోకనాథ పిళ్లై, ఏపీవో చంద్రశేఖర్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



కొత్తపల్లి మిట్టలో సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

షేక్ హసీనాబాకు కలాం విశిష్ట సేవాపురస్కారం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రేణిగుంటకు చెందిన సినిమా ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యురాలు షేక్ హసీనా బాను ఏపీజే అబ్దుల్ కలాం విశిష్ట సేవాపురస్కారం అందుకున్నారు. తిరుపతి కలాం ట్రస్ట్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కలాం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బాష అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సేవారంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురిని అతిథుల చేతుల మీదుగా పురస్కారాలతో సత్కరించారు. అలాగే ఎందరో పేదవిద్యార్థులకు, వృద్ధులకు, నిరాశ్రయులకు, తన వంతు సహాయ, సహకారాలు అందించిన సేవా మూర్తి, రేణిగుంట పట్టణానికి చెందిన తెలుగు సినిమా ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యురాలు షేక్ హసీనా బాను కూడా కలాం విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షేక్ హసీనా బాను మాట్లాడుతూ కలాం ట్రస్టు తనను ఈ పురస్కారం కోసం ఎంపిక చేసి అవార్డు ప్రధానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కలాం ట్రస్ట్ నిర్వాహకులు బాషకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎ జబ్బర్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ భారాలు మోపితే పోరాటం'

ప్రజాశక్తి -పలమనేరు: ప్రస్తుతం కొత్తగా అధికారంలోకి వచ్చిన నూతన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలపై పలమనేరు నియోజకవర్గ సిపిఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్ నాగరాజు , పలమనేరు నియోజకవర్గం మాజీ కార్యదర్శి సి చెన్నకేశవలు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షం లో ఉన్నప్పుడు టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచబోమని ప్రజలపై భారాన్ని మోపమని చెప్పిన కూటమి పార్టీలు అధికారంలో వచ్చినా వెంటనే ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై 8,114 కోట్ల రూపాయలు విద్యుత్తు వినియోగదారులపై భారాన్ని మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో 1.23 పైసలు వసూలు చేస్తున్నారని 1.27 పైసలు వసూలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని చెప్పిన కూటమి పార్టీలు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మోడీ ప్రభుత్వానికి తలవంచి హిందుజా కంపెనీకి అంబానీ 1,234 కోట్ల రూపాయలు దోచిపెట్టడానికి చూస్తున్నదని తీవ్రంగా విమర్శించారు. దీనివలన రైతులకు, విద్యుత్తు వినియోగదారులు అధిక భారాన్ని మోయవలసి వస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచి విద్యుత్ వినియోగదారులపై భారాన్ని మోపితే ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ కౌన్సిల్ సభ్యులు కే రామమూర్తి పాల్గొన్నారు.

క్రీడా హబ్ గా శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్ద నున్నామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఇంటర్ డిస్టిక్ జూడో ఛాంపియన్షిప్ క్రీడాపోటీలను సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శాప్ ఛైర్మన్ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిధులు సాధించి ఈ ప్రాంతాన్ని క్రీడా కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. విద్యార్థులు కూడా విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని తెలిపారు. ఇండోర్ స్టేడియంను అధునాతంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం జిల్లాకు చెందిన పేద జూడో క్రీడాకారిణి ఝాన్సీ, ఆమె కోచ్ గోపిలకు పది వేల రూపాయలు వంతున ఆర్థిక సహాయం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నేత బొల్లినేని జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

వాకర్స్‌కు సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి గోవింద రాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్, తారకరామా స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌లోని 80 సంవత్సరాల పైబడిన వాకర్స్ సభ్యులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 80 వయస్సులో కూడా ఉత్సాహంగా వాకింగ్ చేస్తూ వాకింగ్ చేసే వారికి స్ఫూర్తినిస్తూ ఆరోగ్యం పెంపొందేందుకు దోహదపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, మాజీ డీస్పీ శంకర్, కార్పొరేటర్ ఎస్‌కె.బాబు, మాయాబజార్ భాస్కర్‌రెడ్డి, కత్తుల సుధాకర్, దేవరాజులు నాయుడు, శేషాద్రి, విజయభాస్కర్ రెడ్డి, షాబుద్దీన్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి..

ప్రజాశక్తి - తవణంపల్లి: చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తవణంపల్లి మండలం దిగువతడకర దళితవాడ వాసులు కోరుతున్నారు. మండలంలోని దిగువ తడకర రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 339/ 2లో 5,52 సెంట్లు వెంగమ నాయుని చెరువుగా 2017లో నమోదై రికార్డులు కూడా ఉన్నాయి. ఆక్రమణ దారులను పిలిపించి జెసి 2016లో రికార్డులు రద్దుచేసి వారి నుండి ఆక్రమణలు తొలగించి యథావిధిగా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అప్పట్లో తహశీల్దారు యు వరలక్ష్మి భూమిని పరిశీలించి అనంతరం రికార్డులను రద్దుచేసి ఆక్రమణ తొలగించి యధావిధిగా చేయాలని ఆదేశించారు. అదే గ్రామానికి చెందిన టెలిఫోన్ విశ్రాంత ఉద్యోగి మండల అధికారులతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ ఈ భూమిని ఆక్రమించుకొని మామిడి తోటలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు తనకు మామిడి తోటలు కూడా ఉన్నాయని చెరువు భూమిని తమ భూమి అని తప్పుడు రికార్డుతో కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు కోర్టు అధికారులు అతనికి స్టేటస్కో ఇచ్చారు. ఈ విషయం గమనించిన మండల అధికారులు, స్థానిక గ్రామస్తులు సత్యనారాయణ విషయాన్ని తప్పుపడుతూ ఫిర్యాదు చేసినా తనకున్న పలుకుబడితో చెరువు భూమిని కబ్జా చేసుకున్నాడని తెలిపారు. దిగువతడకర దళిత గ్రామానికి సంబంధించిన చెరువును ఎగువ తడకర గ్రామానికి చెందిన గుండ్లపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి తన పలుకుబడితో ఆ చెరువుని ఆక్రమించుకుని మామిడి పంటలు వేసుకుం టున్నాడని అధికారులకు విన్నవించినా అధికారులు, రెవెన్యూ, జల వనరుల శాఖ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో తీవ్ర ఆందోళన చేపట్టి పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. అప్పటికి అధికారులు స్పందించక పోవడంతో గత వారం రోజులుగా సిసిఎల్ఎకు ఫిర్యాదు చేశారని తెలిసింది. ప్రధానంగా చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతానికి గురైన వారి నుండి కోర్టులో కేసులు నమోదై డబ్ల్యుపిలు ఎన్ని ఉన్నా వాటిని తొలగించి యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర జాతీయ న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేశాయి. హైడ్రా తదితర సంస్థలు పని చేస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. రైతులు మధ్య తరగతి కుటుంబీకులు, వ్యవసాయ కార్మికులు చెరువును చెరువుగా ఉంచాలని భావించి అధికారుల చుట్టూ ప్రదర్శన చేస్తున్నా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు ఆందోళనకు సిద్ధమవు తున్నారు. ఉపాధి కూలీలు సైతం చెరువుకు నీరందించే పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ చెరువు భూమిని యధావిధిగా కొనసాగించాలని ప్రతి సోమవారం నిర్వహించే సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా వీరి సమస్య ఎప్పటికి పరిష్కార మవుతుందో వేచి చూడాల్సి వుంది.